## సిబిల్ స్కోర్ నిబంధనను తొలగించాలి



మాట్లాడుతున్న ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుభాశ్

ఆమనగల్లు, మే 10: ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి సిబిల్‌స్కోర్‌ను కీలకం చేయడం సరైంది కాదని, సిబిల్ స్కోర్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుభాష్ రాష్ట్ర సర్కార్‌ను డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజీవ్‌యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని చెప్పిందని, దానిలో భాగంగా లక్షల సంఖ్యలో నిరుద్యోగ యువత దరఖాస్తులు చేసుకున్నార న్నారు. ఇప్పుడు కొత్తగా సిబిల్ స్కోర్ తప్పకుండా ఉండాలనే నిబంధనతో చాలామంది ఈ పథకానికి దూరమయ్యే అవకాశం ఉందని, వెంటనే సిబిల్ స్కోర్ నిబంధనను విరమించుకోవాల న్నారు. కార్యక్రమంలో యాదయ్య, మహేశ్ ఉన్నారు.

## డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత**

చేవెళ్లటౌన్, మే 10: చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొదటి సంవత్సరానికి ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. బీఏ (ఇంగ్లీష్, తెలుగు మీడియం) బీకాం (కంప్యూటర్ అప్లికేషన్) బీఎస్సీ (లైఫ్ సైన్సెస్) బీఎస్సీ (ఫిజికల్ సైన్సెస్) కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కళాశాలలో దోస్త్ కోడ్ 12041 అని ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9490117490, 8328176599 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



నందిగామ, మే 10 : మండల పరిధిలోని బండోనిగూడ గ్రామంలో బీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. మొదటి బహుమతి ఆర్‌సీబీ జట్టు, రెండో బహుమతి ముంబయి జట్టులకు మాజీ సర్పంచ్ కుమార్, నాయకులు బుచ్చయ్య బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు జట్ట కుమార్, బుచ్చయ్యలను ఆర్గనైజర్లు సన్మానించారు.

## టెక్నాలజీ హబ్‌గా భారత్



పెద్దఅంబర్‌పేట, మే 10: రానున్న రోజుల్లో భారతదేశం టెక్నాలజీ హబ్‌గా మారనున్నదని ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ జీ సతీశ్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధి కుంట్లూరులోని పల్లవి ఇంజినీరింగ్ కాలేజీ 16వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సతీశ్‌రెడ్డి, జేఎన్‌టీయూహెచ్ మాజీ రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్, కాలేజీ చైర్మన్, ఎమ్మెల్సీ మల్కా కొమరయ్యతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. పరిశోధన రంగంలో ఇండియా ప్రపంచంలోనే మూడోస్థానంలో ఉన్నదని తెలిపారు. విద్యార్థులు స్టార్టప్‌ల రూపకల్పనలో ముందుండాలన్నారు. ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్య ద్వారా లోతైన విశ్లేషణలు, సాంకేతికంగా ప్రజోపయోగమైన ఆవిష్కరణలు సాధ్యమవుతాయన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రతినిధులు మల్కా నవీన్‌కుమార్, రామశేషగిరిరావు, ప్రిన్సిపాల్ ఎంబీ రాజు, ప్రోగ్రాం కన్వీనర్లు నవ్య, ప్రియంవద తదితరులు పాల్గొన్నారు.

## మత విద్వేషాలను రెచ్చగొట్టొద్దు

చేవెళ్లటౌన్, మే 10: రాజకీయ ప్రయోజనాల కోసమే కులమతాలను పెంచి పోషిస్తున్నారని బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య అన్నారు. శనివారం చేవెళ్ల మండల కేంద్రంలో కులం సామాజికం మతం, వ్యక్తిగతం, మతసామరస్యం పౌరుల బాధ్యత అనే అంశంపై భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా జిల్లాస్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో అధికార లెక్కల ప్రకారం 3వేల కులాలు ఉన్నాయని, 2500 ఉప కులాలు, 8 మతాలు అందులో నూటికి 80శాతం మంది హిందూమతాన్ని విశ్వసిస్తున్నారని తెలిపారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే రాజకీయ నాయకులపై క్రిమినల్ కేసులు పెట్టి వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. యావత్ ప్రజానికం మతసామరస్యాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు అంజయ్య, ప్రధాన కార్యదర్శి జంగయ్య, ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు తదితరులు ఉన్నారు.

## మలక్‌పేటలో 13న గ్రాండ్ జాబ్ ఫెయిర్

సైదాబాద్, మే 10: మలక్ పేట నియోజకవర్గం పరిధిలోని నిరుద్యోగ యువతీ, యువకుల కోసం ఈ నెల 13న 'గ్రాండ్ జాబ్ ఫెయిర్ 2025' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, ఇబ్నాట్ ఫౌండేషన్ సహకారంతో అక్బర్ బాగ్ డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ మెస్ లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ , పీజీ, డిప్లమా, బీఈ, బీటెక్ పూర్తిచేసిన యువతీ, యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిరుద్యోగులు కొత్తవారు, అనుభవాలు ఐట్టి, నాన్ ఐటీ, బ్యాంకింగ్ సేల్స్ డిజిటల్ మార్కెటింగ్ రంగాలకు సంబంధించిన ఉద్యోగాలు పొందేందుకు ఈ అవకాశం దోదపడుతుందన్నారు. మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ఎంఈ, మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ (ఎన్ ఎస్ బి ఐ), టెలికాం (ఎంప్లాయిమెంట్ ఇన్ అబ్రాడ్)తో సహా 50 ప్రైవేట్ కంపెనీల సంస్థలలో వందలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ, యువకులు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.



అంతారం టు కౌకుంట్ల రోడ్డులో మట్టి, కంకర పోసి వదిలేసిన దృశ్యం

రోడ్డు తవ్వారు..

# మట్టితో నింపారు..

**మరమ్మతులకు నోచుకోని గ్రామీణ రోడ్లు**
**కాంట్రాక్టర్ జాప్యంతో ప్రయాణానికి ఇబ్బందులు**
**పనులు త్వరగా పూర్తి చేయాలని వేడుకోలు**

చేవెళ్ల రూరల్, మే 10 : ప్రభుత్వం గ్రామీణ రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టడంలో విఫలమైంది. కొత్త రోడ్ల నిర్మాణం దేవుడెరుగు.. పాత రోడ్ల మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసినా ప్రజాప్రతినిధులు, అధికారుల, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడం లేదు. చేవెళ్ల మండల పరిధి అంతారం గేట్ నుంచి నారెగూడెం గేట్ వరకు, ఆలూర్ గేట్ నుంచి దుద్దాగు గ్రామ ప్రధాన రోడ్డు వరకు గుంతలమయమైన రోడ్డుకు ప్రభుత్వం రూ.1.70కోటి నిధులు విడుదల చేసింది. మరమ్మతుల కోసం కాంట్రాక్టర్ పలుచోట్ల రోడ్డును తవ్వి మట్టి కంకర నింపి వదిలేశారు.

**అవస్థలు పడుతున్న ప్రయాణికులు..**

రోడ్డును తవ్వి మట్టి, కంకరతో నింపడంతో ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారి పరిస్థితి మరీ దారుణంగా తయారయ్యింది. అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. పనులు త్వరగా పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



అంతారం గేట్ నుంచి నారెగూడెం గేట్ వెళ్లే ప్రధానదారి..

## ఘనంగా అంజయ్యయాదవ్ పుట్టిన రోజు వేడుకలు



కొత్తూరు : మాజీ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కొత్తూరు, మే 10: మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పుట్టిన రోజు వేడుకలను బీఆర్‌ఎస్ నాయకుడు దేవేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో కొత్తూరులో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్యయాదవ్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం మున్సిపల్ బీఆర్‌ఎస్ నాయకులు ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ, కౌన్సిలర్ మాదారం నర్సింహగౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణయాదవ్, యాదగిరి, సత్తయ్య, మధుసూదన్‌రావు, సురేశ్, జంగయ్య, లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

**కేశంపేట మండలంలో..**

కేశంపేట : షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ జన్మదిన వేడుకలను కేశంపేట మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రెడ్ రోసి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ విశ్వనాథం, మాజీ జడ్పీటీసీ పి.నర్సింగ్‌రావు, యువ నాయకులు ప్రేమ్‌కుమార్‌గౌడ్, బి.వెంకటయ్య, ఎన్.గోపాల్, మురళీమోహన్, రాము, రమేశ్‌యాదవ్, నాగేశ్, కొండల్‌రెడ్డి, జావిద్, జగన్‌మోహన్‌రెడ్డి, యాదగిరి, దశరథ్, నరేశ్, శివ, శ్రీశైలం, ఆసీఫ్, కుమార్, లింగం, సురేశ్, మల్లేశ్ పాల్గొన్నారు.

**కొందుర్గులో..**

కొందుర్గు : షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ జన్మదిన వేడుకలను కొందుర్గు, చౌదరిగూడ మండలాల్లో బీఆర్‌ఎస్ నేతలు శనివారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు. కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, సయ్యద్ హఫీజ్, మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్, బంధులాల్, రామకృష్ణ, రాంచంద్రయ్య, రెడ్డి నర్సింహులు, సుందర్, అబ్దుల్‌కలాం, ప్రేమ్‌కుమార్, చందు, రవీందర్‌గౌడ్, బాలరాజ్, వెంకటేశ్, ప్రభుదాస్, సాయన్న, వీరన్న, బసప్ప, బుచ్చిలింగం, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

**షాద్‌నగర్‌రూరల్ :** మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని శనివారం ఫరూఖ్‌నగర్ మండలంలోని వివిధ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ఉత్తర రామలింగేశ్వర స్వామి, ఎలికట్ట భవానీమాత ఆలయంలో బీఆర్‌ఎస్ శ్రేణులు పూజలు చేసి కేక్‌ను కట్ చేసి సంబురాలు చేసుకొన్నారు. అదే విధంగా షాద్‌నగర్ పట్టణంలోని రెడ్‌రోజ్ గార్డెన్‌లో నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ జన్మదిన వేడుకలకు తరలివెళ్లారు. పూజలు నిర్వహించిన వారిలో విఠ్యాల యువ నాయకుడు శేఖర్, వీరేశం, నారాయణ, వెంకట్‌రెడ్డి, చందూనాయక్ పాల్గొన్నారు.

## వీర జవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి



తుర్కయాంజల్ : మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

తుర్కయాంజాల్, మే 10 : ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన మురళీనాయక్ త్యాగం దేశం మరువలేనిదని తుర్కయాంజాల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ అయిలయ్య అన్నారు. శనివారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ వివేకానంద చౌరస్తాలో మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**చేవెళ్లటౌన్ :** భారత్, పాకిస్తాన్ యుద్ధంలో వీర మరణం పొందిన భారత్ జవాన్ మురళీనాయక్ చిత్ర పటానికి చేవెళ్ల పట్టణ కేంద్రంలో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, నాయకులు శంకర్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

# వేసవి దుక్కులతో అధిక దిగుబడి

**చీడపీడల నాశనానికి దోహదం**
**తేమ శాతం పెరుగుతుందంటున్న**
**వ్యవసాయ శాఖ అధికారులు**



చేవెళ్లటౌన్, మే 10 : వేసవి కాలం రైతులు పొలాలను చదును చేస్తే వానకాలం పంటలు అధిక దిగుబడిని ఇచ్చే అవకాశం ఎంతగానో ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు పలు సూచనలు చేస్తున్నారు. ఇందుకుగాను రైతులు వానకాలం పంటల సాగుకు వేసవి ఆరంభం నుంచే పంట పొలాలను చదును చేసే క్రమంలో ముందుంటారు. వేసవిలో పొలాలను చదును చేసినట్లైతే సూర్యభగవాణుడి వేడి ప్రతాపానికి దుక్కులు ఎండ కాగి పొలంలో ఉన్నటువంటి పంటలకు నష్టం చేసే చీడ పురుగులు, తెగుళ్లు చనిపోవడంతో పాటు కలుపు మొక్కలు కూడా తగ్గుతాయని పేర్కొంటున్నారు. సాగుకు పెట్టుబడులు కూడా తగ్గి అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

**చీడ పురుగులు, తెగుళ్ల బెడద నివారణ..**

పంట నష్టం చేసే చీడ పురుగులు, తెగుళ్లు వాటి సంతానం కూడా తగ్గుముఖం పట్టి పంటలు ఏపుగా పెరిగి అధిక దిగుబడి ఇచ్చే అవకాశం ఉంటుంది.

**కలుపు మొక్కలు నశిస్తాయి..**

పొలాలను చదును చేయడంతో ఆ పొలంలోని తేమ శాతం పెరిగే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా తేమ నిల్వగా ఉండడంతో కలుపు మొక్కలకు చెందిన విత్తనాలే కాకుండా అంతకు ముందు పొలంలో వేసిన పంట విత్తనాలను మెలకెత్తనివ్వకుండా నివారించవచ్చంటున్నారు. అలాగే సాగు చేసిన పంటలకు సరైన సమయంలో వర్షాలు కురువకపోయినా పొలంలోని తేమతో పంటలు పాడవకుండా ఉండేందుకు దోహదపడుతుంది. దీనితో పొలంలో వేసిన సేంద్రియ, రసాయనిక ఎరువులను పంటలు సక్రమంగా వినియోగించుకోవడంతో పంట దిగుబడి అధికంగా ఉంటుందని చెప్పవచ్చు.

**పూర్వకాలం నుంచే మొదలు..**

వేసవి ఆరంభం నుంచే పంట పొలాలను దున్నుకోవడం పూర్వ కాలం నుంచే ప్రారంభించే వారని వేసవిలో చదును చేసిన పొలంలో పైరు ఏపుగా పెరిగి అధిక ధిగుబడిని వస్తుందని పెద్దలు అంటుంటారు. అలాగే వేసవిలో మొదటగా వచ్చే ఉగాది పండుగ రోజు పొలాలను తున్నడం ప్రారంభిస్తే వానకాలంలో వేసిన పంట దిగుబడి అధకంగా ఉంటుందనేది వారి నమ్మకం.

**ఎన్నో ప్రయోజనాలు..**



వేసవిలో లోతుగా దుక్కలను దున్నుకోడంతో వర్షకాలంలో ఎన్నో ప్రయోజనాలుంటాయి. సేంద్రియ ఎరువులను ఉపయోగించాలి. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి. ఆధునిక పద్ధతులతో సాగు చేసుకోవాలి.

**- సురేశ్‌బాబు, చేవెళ్ల ఏడీఏ**

## చెరువులో మునిగి వ్యక్తి మృతి

మొయినాబాద్, మే10 : చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు చెరువులో మునిగి మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిలుకూరు గ్రామానికి చెందిన తోల్కట్టా లచ్చయ్య కుమారుడు శ్రీశైలం (28) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే శ్రీశైలం ఈ నెల 8వ తేదీన మధ్యాహ్నం సమయంలో గండిపేట చెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. శ్రీశైలం ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల వెతికినా కుమారుడి ఆచూకి లభించలేదు. అయితే శనివారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన కొందరు చెరువు వైపు వెళ్లి చూడగా చెరువులో మృతదేహం కనిపించడంతో మృతుడి తండ్రి లచ్చయ్యకు సమాచారం ఇచ్చారు. లచ్చయ్య, వారి కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా... శ్రీశైలం చెరువులో మునిగి మృతి చెందినట్లుగా గుర్తించారు. కాగా, కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఘటన స్థలానికి వారు చేరుకుని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## పురుగుల మందు తాగి యువకుడి మృతి

మొయినాబాద్, మే 10 : ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన చిట్టెంపల్లి యాదయ్య కుమారుడు చిట్టెంపల్లి దాసు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు దవాఖానకు తీసుకెళ్లారు. ఉస్మానియా దవాఖానలో చికిత్స పొందుతూ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# స్లీపర్ సెల్స్‌పై ప్రత్యేక నజర్..!

- నగర అంతర్గత భద్రతపై ప్రత్యేక దృష్టి..
- పాతనేరస్తుల కదలికలపై నిఘా..
- ఉగ్ర సంబంధాలు, సానుభూతిపరుల గుర్తింపునకు రంగంలోకి షాడో బృందాలు..



సిటీబ్యూరో, మే 10 (నమస్తే తెలంగాణ): నగర అంతర్గత భద్రతపై ట్రైకమిషనరేట్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో దేశవ్యాప్తంగా కొనసాగుతున్న హై అలర్ట్‌ను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే అప్రమత్తమైన నిఘా వ్యవస్థ స్లీపర్ సెల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. అసాంఘీక శక్తులు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అవకాశాలున్నందున పాతనేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టారు. ప్రజల్లో అలజడి సృష్టించేందుకు యత్నించే దుష్టశక్తులను గుర్తించేందుకు ఇప్పటికే ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగినట్లు సమాచారం. అంతే కాకుండా సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తప్పుడు సమాచారం చేరవేస్తూ రెచ్చగొట్టడం, భయభ్రాంతులకు గురిచేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే ప్రకటించిన పోలీస్‌శాఖ ఆ దిశగా సోషల్ మీడియాను ప్రత్యేక బృందాలతో క్షుణ్ణంగా పర్యవేక్షిస్తోంది.

**పాతనేరస్తులపై ప్రత్యేక నజర్..**

గతంలో శాంతిభద్రతల విఘాతానికి పాల్పడిన పాతనేరస్తులు, మతకల్లోహాలకు పాల్పడిన నేరస్తుల కదలికలపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులతోపాటు జైలులో ఉన్న ఖైదీలు, జైలు నుంచి విడుదలైన వారిపై సైతం నిఘా వర్గాలు ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం.

**రంగంలోకి షాడో బృందాలు..**

దేశంలో జరిగిన ఉగ్రదాడులకు సంబంధించిన మూలాలు నగరంలో తేలిన గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ట్రై కమిషనరేట్ పరిధిలో ఉగ్ర సంబంధాలున్న వారు ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు వేట మొదలు పెట్టారు. ఉగ్ర సంబంధాలున్నవారితో పాటు వారి సానుభూతి పరులను గుర్తించేందుకు షాడో బృందాలను రంగంలోకి దింపినట్లు సమాచారం. గత కొంత కాలంగా హైదరాబాద్ నగరం ప్రశాంతంగా ఉన్నప్పటికీ ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో నగరంలో నెలకొన్న శాంతి సామరస్యాన్ని చూసి ఓర్వలేని ఏవైన దుష్టశక్తులు నగరంలోకి ప్రవేశించకుండా నిఘా వ్యవస్థలు డేగ కన్ను పెట్టాయి.

**తనిఖీలు ముమ్మరం..**

భద్రతా చర్యల్లో భాగంగా ట్రై పోలీస్ కమిషనరేట్ పరిధిలో తనిఖీలు ముమ్మరం చేశారు. ముఖ్యంగా రాష్ట్ర సరిహద్దులు, నగర సరిహద్దుల్లో దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో నగరానికి వచ్చిపోయే వాహనాలను పోలీసులు క్షణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

**సున్నిత ప్రాంతాల వద్ద భారీ బందోబస్తు**

మహానగరంలోని సున్నిత, అతి సున్నిత ప్రాంతాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ప్రముఖ ప్రార్థనా మందిరాలు, ఆలయాలు, బహిరంగ ప్రదేశాలు, చారిత్రాత్మకమైన పర్యాటక ప్రాంతాల వద్ద ప్రత్యేక నిఘా పెట్టారు. సీసీ కెమెరాలతో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. గచ్చిబౌలి ఇండోర్‌స్టేడియంలో జరుగుతున్న ప్రపంచ అందాల పోటీల నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర బలగాలతో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఈ పోటీలు జరిగే ప్రాంతంతో పాటు శంషాబాద్ విమానాశ్రయం చుట్టూ 10కిలో మీటర్ల దూరం వరకు డ్రోన్‌లపై నిషేధం విధించారు.

## లో వోల్టేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి



పద్మాలయ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

హయత్ నగర్, మే 10 : డివిజన్ పరిధిలోని పద్మాలయ కాలనీలో తరచుగా నెలకొంటున్న లోవోల్టేజీ విద్యుత్ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేశామని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి తెలిపారు. శనివారం పద్మాలయ కాలనీలో కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి, విద్యుత్ ఏఈ ఖాదర్ ఆలీతో కలిసి నూతనంగా ఏర్పాటుచేసిన 160 కే వీ ఏ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీలో లోవోల్టేజీ విద్యుత్ సమస్య కారణంగా కాలనీ వాసులు అనేక ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. దశలవారీగా కాలనీలలో అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్‌మన్ అశోక్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యుడు అంజయ్య గౌడ్, నరసింహులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

**హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్**

సైదాబాద్, మే 10 : మాదన్నపేట మార్కెట్‌లో రోడ్లపై అక్రమ వ్యాపారాలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ శనివారం మాదన్న పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మాదన్నపేట్ మార్కెట్లో 62 మంది వ్యాపారులకు అధికారికంగా లైసెన్సులు ఇవ్వడం జరిగిందని, అయితే అందుకు విరుద్ధంగా వ్యాపారులు రోడ్లపై వ్యాపారాలు కొనసాగిస్తూ మార్కెట్‌కు వచ్చే వినియోగదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని తెలిపారు. లైసెన్స్ పొందిన వ్యాపారులంతా తమ స్థలాలను ఇతరులకి లీజులకు ఇచ్చి అక్రమ వ్యాపారాలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నారన్నారు. రోడ్లు అక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారి మూలంగా కొనుగోలుదారులకు, అదే విధంగా దిగుమతి, ఎగుమతి చేసే వ్యాపారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తూ మార్కెట్లో ట్రాఫిక్ అంతరాయం సృష్టిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై అక్రమ వ్యాపారం చేస్తున్న వారిని గుర్తించి, తగు చర్యలు తీసుకోవాలని మాదన్నపేట్ పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. కూరగాయలు, ఆకుకూరల కొనుగోలు కోసం వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.